ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 3 జనవరి 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్టం : 28.0
కనిష్టం : 18.0



గుడ్డు అధరహో !

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 2: కోడిగుడ్డు ధర రోజు రోజుకు అదరగొడుతోంది. ఒక పక్క కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తుంటే కోడిగుడ్డు కంగారెత్తిస్తోంది. ఇటీవలి కాలంలో డైలీ మార్కెట్‌లో గుడ్డు రూ.5 నుంచి 6 వరకు ఉండగా తాజాగా రూ.7కు చేరింది. మేత ధరలు పెరిగిపోవడం, దిగుబడి డిమాండ్‌కు సరిపడా లేకపోవడం, ఎగుమతులు ఆశాజనకంగా ఉండటం తదితర కారణాలతో గుడ్డు ధరలు పెరుగుతున్నట్టు చెబుతున్నారు. పౌల్ట్రీ నిర్వాహకులు మాత్రం పెరిగిన కోళ్ల మేతతో పోలిస్తే ఈ ధర అంత లాభసాటి కాదంటున్నారు. మేతల ధరలు తగ్గకపోతే గుడ్డు పది రూపాయలకు చేరినా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు.



నిరసన హోరు

జిల్లాలో అంగన్‌వాడీల ఆందోళన హోరెత్తుతోంది. మంగళవారం పొర్లు దండాలు పెట్టారు. భీమవరం, తణుకు, గణపవరం, పెనుగొండ తదితర ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. పెనుమంట్రలో దున్నపోతుకు వినతిపత్రం సమర్పించారు. తాడేపల్లిగూడెంలో మెడకు ఉరి బిగించుకుని ఆందోళన చేశారు.(పై ఫొటో) -8లో..

ప్రభుత్వంతో చర్చలు విఫలం

నేటి నుంచి సమ్మె మరింత ఉధృతం : మునిసిపల్ కార్మికులు

ఏలూరు టూ టౌన్, జనవరి 2: మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలమైనట్టు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య తెలిపారు. మంగళవారం అమరావతిలో చర్చలు జరిగాయి. గత 8, 9 పీఆర్‌సీల ప్రకారం ఆనాటి ప్రభుత్వాలు కనీస వేతనాలు ఇచ్చాయన్నారు. 11వ పీఆర్‌సీలో కనీస వేతనం రూ.20 వేలు ఉండగా, జగన్ ప్రభుత్వం కేవలం రూ.15 వేలు ఇస్తోందన్నారు. చర్చల్లో కనీస వేతనం రూ.20 వేలు డీఏ కలిపి ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్ ఈ ప్రతిపాదనలు తిరస్కరించారు. కనీస వేతనాలు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. దీంతో బుధవారం నుంచి సమ్మె మరింత ఉధృతం చేయాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి.



ఎమ్మెల్యే బాలరాజు సతీమణికి ఛాన్స్

పోలవరం వైసీపీ సమన్వయకర్తగా రాజ్యలక్ష్మిని ప్రకటించిన అధిష్ఠానం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

అందరూ ఊహించినట్లుగానే వైసీపీలో మార్పులు చేర్పులు ఆరంభం అయ్యాయి. దీనికితోడు ఒకవేళ తనకు వద్దనుకంటే భార్యకో లేదా కుమారుడికి ఎమ్మెల్యే టికెట్ చాన్స్ ఇవ్వాలని నాయకత్వానికి చేసిన అభ్యర్థనలకు సమ్మతి లభిస్తోంది. ఈ కోణంలోనే పోలవరం ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం సిట్టింగ్ ఎమ్మెల్యేగా కొనసాగిన తెల్లం బాలరాజును తప్పించి ఆయన సతీమణి తెల్లం రాజ్యలక్ష్మిని పోలవరం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా మంగళవారం రాత్రి నియమించింది. మొదటి నుంచి బాలరాజును తప్పిస్తారనే వార్త నిజమైంది. ప్రత్యేకించి సర్వేలు, నిఘా వర్గాల సమాచార ప్రకారం మార్పులు చేర్పులకు వైసీపీ సుదీర్ఘ కసరత్తు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే బాలరాజుకు తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించుకుని నీకు టికెట్ లేదని ఖరాఖండిగా చానాళ్ల క్రితం తేల్చేశారు. దీనికి బదులుగా ఎస్టీ రిజర్వుడు కోటాలో రాజ్యసభకు అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బాలరాజు మాత్రం తనకు ఇవ్వకపోయినా పర్వాలేదు. తన సతీమణి రాజ్యలక్ష్మికి చాన్స్ ఇవ్వాలని సీఎం జగన్‌ను ఎదుట ప్రాధేయపడ్డారు. ఈ నేపథ్యంలో ఒకవైపు రాజ్యలక్ష్మి, మరోవైపు బుట్టాయగూడెం స్థానిక మహిళా నేత రామ తులసి మధ్య ప్రజాభిప్రాయం ఎలా ఉందనే దానిపై కొద్ది రోజులుగా నియోజకవర్గం అంతా అభిప్రాయసేకరణ చేశారు. కడకు రాజ్యలక్ష్మి అభ్యర్థిత్వం వైపు నాయకత్వం మొగ్గు చూపింది. ప్రత్యేకించి పోల వరం నియోజకవర్గంలో ఒక ఎస్టీ మహిళకు అవకాశం ఇచ్చినట్లు ఉంటుందని సిట్టింగ్ ఎమ్మెల్యే విన్నపాన్ని మన్నించినట్లవుతుందని ఈ నిర్ణయం తీసుకున్నారు. పోలవరంలో ఎట్టకేలకు సస్పెన్స్‌కు తెరదించారు. ప్రస్తుత సమన్వయకర్త వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి అవుతారు. తెల్లం రాజ్యలక్ష్మి బుట్టాయగూడెం మండలం దొరమామిడి జడ్పీ హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు.

చింతలపూడిలో విజయరాజుకు లైన్ క్లియర్ !

ఏలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చింతలపూడి వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఎలీజాను తప్పించి, ఆయన స్థానంలో ఏలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కంభం విజయరాజును బరిలో నిలపాలని దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల సమాచారం. మంగళవారం విడుదలైన సమన్వయకర్తల జాబితాలో ఆయన పేరును లేకపోయినప్పటికీ 2-3 రోజుల్లో రానున్న మూడో జాబితాలో స్పష్టత రానుంది. మండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజు వియ్యంకుడైన ఆయన 20 రోజుల క్రితమే తన ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీ పనుల్లో నిమగ్నమవుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

ఆచంట నుంచే ఎన్నికల శంఖారావం

7న టీడీపీ అధినేత చంద్రబాబు రాక.. భారీ బహిరంగ సభ

టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో నేతల స్పష్టం

ఆచంట, జనవరి 2 : ఆచంట నుంచి తెలుగుదేశం-జనసేన ఎన్నికల శంఖారావం పూరించనున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ప్రకటించారు. ఈ నెల 7న ఇక్కడ జరిగే భారీ బహిరంగ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు విచ్చేస్తున్నారని తెలిపారు. మంగళవారం ఆచంటలో జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఆచంటలో జరిగే సభకు ఏడు నియోజకవర్గాల నుంచి లక్ష మందికి పైగా జనం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ రానప్పటికి టీడీపీ, జనసేన సమన్వయంతోనే సభను విజయవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆచంట సభ టూర్ కో ఆర్డినేటర్, రాజమండ్రి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు చలో ఆచంటగా నామకరణం చేశామన్నారు. ఈ సభతో ఎన్నికల కురుక్షేత్రానికి వెళుతున్నట్లు తెలిపారు. శాడిస్టు సీఎం వైఎస్ జగన్ వల్ల రాష్ట్రం సర్వ నాశనమైందని, ఈ రాష్ట్రానికి మళ్లీ వెలుగులు నింపేందుకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయన్నారు. 90 రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో కోడి కత్తి డ్రామాతో జగన్ అధికారంలోకి వచ్చారని ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు వచ్చాయన్నారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు అన్నివిధాలా మోసపోయారని, ప్రజలంతా టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆచంట నుంచి మార్టేరు వెళ్లే రోడ్డులో ఒక లే అవుట్ స్థలాన్ని బహిరంగ సభకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కలవపూడి శివ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, నరసాపురం ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆచంటలో నిర్వహించే సభ కోసం సభాస్థలిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

బియ్యం ధరలు భగ్గు



బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారారు. ధరలు అమాంతం పెంచేస్తున్నారు. జిల్లా వాసులు సన్నరకాలనే కొనుగోలు చేస్తుంటారు. దీంతో మార్కెట్‌లో వాటికి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. పెరిగిన ధరలతో కొనాలంటేనే సామాన్య, మధ్య తరగతి జనం జంకే పరిస్థితులు నెలకొన్నాయి.

వ్యాపారుల సిండికేట్

26 కిలోల ప్యాకెట్ రూ.1500 పైనే

సన్న రకంపైనే జిల్లాలో మోజు

తినాలంటేనే జంకుతున్న జనం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పశ్చిమకు సన్నరకాలు దిగుమతి అవుతున్నాయి. ప్రధానంగా సోనామసూరి వంటి రకాలను జిల్లాలో ఎక్కు వగా వినియోగిస్తుంటారు. జిల్లాలో సాగయ్యే రకాలపై పెద్దగా ఆసక్తి చూపరు. కేవలం రేషన్ పంపిణీకి మాత్రమే జిల్లాలో ఉత్పత్తి అయ్యే బియ్యం ఉపయోగ పడుతున్నాయి. మళ్లీ అవి మార్కెట్‌కు తరలిపోతున్నాయి. ఏడాదిన్నర క్రితం వరకు రిటైల్ మార్కెట్‌లో 26 కేజీల బస్తా రూ.1150 పలికిన బియ్యం ఇప్పుడు రూ.1550కి చేరింది. అదే మాల్స్ అయితే మరో రూ. 100 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. మార్కెట్లో బ్రాండెడ్ సన్నబియ్యం నాలుగునెలల క్రితం కిలో రూ.45 ఉండగా ప్రస్తుతం రూ.60 నుంచి రూ.62 వరకు విక్రయిస్తున్నారు. బియ్యం మార్కెట్‌పై ప్రభుత్వానికి ఆజమాయిషీ లేకుండా పోయింది. ధరలకు కళ్లెం వేయాలని భావిస్తే అధికారులు రిటైల్ మార్కెట్‌పై పడుతున్నారు. తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు. సన్నరకాలు ఉత్పత్తి చేసే పెద్ద వ్యాపారులు జోలికి పోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది వ్యాపారుల చేతుల్లోనే సన్న బియ్యం మార్కెట్ ఆధారపడి పోయింది. వారు ఎంతంటే అంతే ధర.ధాన్యం కొరత ఉందంటూ ఇప్పుడు ధరలు పెంచేశారు. వాస్తవానికి రైతువద్ద ధాన్యం ఉన్నప్పుడు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. రైతుల నుంచి సన్న రకాలు పూర్తిగా కొనుగోలు చేసిన తర్వాత ధాన్యం ధరలు పెంచుతున్నారు. ఇప్పటికే మిల్లర్ల వద్ద సన్న రకాలైన ధాన్యం గొడౌన్‌లో నిల్వ చేసుకుంటున్నారు.



గతంలో ప్రభుత్వాలు కట్టడి చేసేవి

బియ్యం ధరలు పెరిగితే గతంలో ప్రభుత్వాలు రంగంలోకి దిగేవి. వ్యాపారులే తక్కువ ధరలకు సన్న బియ్యం విక్రయించేలా చర్యలు చేపట్టేవి. అందుకోసం ప్రత్యే కంగా కౌంటర్లు ఏర్పాటు చేసేవారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అమ్మకాలు సాగించేవారు. ఇలా కొంతమందికి అయినా సరే తక్కువ ధరకు సన్నరకాలు లభ్య మయ్యేవి. ఆ తర్వాత ధరలు అదుపులోకి వచ్చేవి. అప్పుడు కౌంటర్‌లను తొల గించే వారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధరలను బొత్తిగా పట్టించుకోవడం లేదు. వ్యాపారులను కట్టడి చేయలేకపోతున్నారు. ప్రభుత్వ పెద్దలను శాసించే స్థితిలో బడా వ్యాపారులున్నారు..

తెలివి మీరిన వ్యాపారులు

కేంద్ర ప్రభుత్వం బియ్యంపై జీఎస్టీని తొలగించింది. కేవలం బ్రాండెడ్ రకాలకు మాత్రమే 5 శాతం జీఎస్టీని అమలు చేసింది. దాంతో బ్రాండెడ్ అమ్మకాలు సాగించే వ్యాపారులంతా కుమ్మక్కయ్యారు. రిజిస్ట్రేషన్ చేసిన బ్రాండెడ్ పేర్లతో బియ్యం విక్రయాలను నిలిపివేశారు. వాటి ముందు శ్రీ తగిలించి బియ్యం అక్రమాలకు తెరలేపారు. ఇలా జీఎస్టీని నుంచి తప్పించుకున్నారు. చివరకు ప్రభుత్వం 25 కిలోల ప్యాకెట్‌పై జీఎస్టీని అమలు చేసింది. దానికీ వ్యాపారులు ప్రత్యామ్నాయం కనిపెట్టారు. మార్కెట్‌లో 25 కిలోల ప్యాకెట్‌ల సరఫరాను నిలిపివేశారు. ఇప్పుడు 26 కిలోల ప్యాకెట్‌లు దిగుమతి చేస్తున్నారు. ఇలా జీఎస్టీకి ఎగనామం పెట్టారు.

పన్ను పేరుతో దగా

ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా 26 కిలోల ఎత్తుగడను వేసిన వ్యాపారులు ధరలను మాత్రం పెంచేశారు. మార్కెట్‌లో 25 కిలోలు ప్యాకెట్‌లకు జీఎస్టీ అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన తక్షణమే రూ. 100 పెంచారు. అప్పటినుంచి మార్కెట్‌లో ధరలు పెంచుతూ వస్తున్నారు. కానీ ప్రభుత్వానికి పన్ను చెల్లించడం లేదు. బియ్యంపై పన్ను లేనప్పుడు మాత్రం తక్కువ ధరకే బియ్యం లభ్యమయ్యేవి. ధరలు పెంచేందుకు వ్యాపారులు సాహసించేవారు కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. పన్ను పేరుతో ధరలు పెంచేస్తున్నారు. పన్ను చెల్లించ కుండా ప్రభుత్వాన్ని, ధాన్యానికి ధర ఇవ్వకుండా రైతులను, ధరలు పెంచుతూ వినియోగదారులను బడా వ్యాపా రులు దగా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దీనిపై ఏమీ ఆలోచించడం లేదు. బియ్యం దొంగ వ్యాపారం చేసిన వారికే తాళాలు అప్పగించింది. వారికే రాష్ట్రంలో కీలక బాధ్యతలు అప్పగించింది. అధికార పార్టీ అండదండలు ఉండడంతో సదరు వ్యాపారి బియ్యం ఎగుమతుల్లో ఆరితేరిపోయారు. ఇతర బడా వ్యాపారులకు అండగా ఉంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఉండి మండలం కలిగొట్లలో జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి తదితరులు

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ ప్రశాంతి

ఉండి, జనవరి 2 : జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం ఉండి మండలం కలిగొట్ల గ్రామంలో రెండవ విడత కార్యక్రమాన్ని నోడల్ అధికారిణి విజయలక్ష్మీతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలో ఆరు నెలలు పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని గ్రామీణ ప్రాంతాలలో మంగళ, శుక్రవారాల్లో, పట్టణ ప్రాంతాల్లో బుధ, గురువారాలలో జరుగుతుందన్నారు. ప్రతీ క్యాంపులోను ఇద్దరు స్పెషలిస్టు, నలుగురు వైద్య అధికారులుంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో 92 రకాల మందులను, పట్టన ప్రాంతాలలో 187 రకాల మందులను పంపిణీ చేస్తారన్నారు. 14 రకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు.ఆశ వర్కుర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచ్ ఎంఎస్, ఎంపీటీసీ యువరాజు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ మహేశ్వరరావు, తహసీల్దారు ఏడిద శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఏడు మండలాల్లో కార్యక్రమాలు

భీమవరం జనవరి 2 : జిల్లాలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు బుధవారం ఏడు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడుల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి

కేంద్ర మంత్రి రూపాలా 7



దూసుకొచ్చిన మృత్యువు



డివైడర్ దాటి వచ్చి ఢీకొన్న కారు

మరో కారులో ఉన్న ముగ్గురి మృతి

10, 11 తేదీల్లో నరసాపురం- సికింద్రాబాద్‌ల మధ్య స్పెషల్ ట్రైన్‌లు

నరసాపురం, జనవరి 2: సంక్రాంతి పండుగ రద్దీని పరిగణలోకి తీసుకుని ఈ నెల 10, 11 తేదీల్లో నరసాపురం- సికింద్రాబాద్‌ల మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. 07251 నంబర్‌తో 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు నరసాపురంలో స్పెషల్ ట్రైన్ బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ట్రైన్ జిల్లాలో పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు స్టేషన్‌లలో ఆగుతుంది. గుంటూరు, నల్గొండ, మిర్యాలగూడ మీదుగా సికింద్రాబాద్ వెళ్తుంది. 07252 నంబర్‌తో అదే రోజు రాత్రి 11.30కు సికింద్రాబాద్‌లో బయలుదేరి వరంగల్, ఖాజీపేట, ఖమ్మం మీదుగా మరుసటి రోజు ఉదయం 8.30కు నరసాపురం చేరుకుంటుంది.

ఐలూ జాతీయ కేంద్ర కమిటీ సభ్యురాలిగా శైలజ


ఓరుగంటి శైలజ

ఏలూరు క్రైం, జనవరి 2 : ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జాతీయ కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఏలూరుకు చెందిన న్యాయవాది ఓరుగంటి శైలజను ఎన్నుకున్నారు. గత డిసెంబరు 28, 29, 30 తేదీల్లో కోల్‌కతాలో జరిగిన ఐలు 14వ జాతీయ మహాసభల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 26 రాష్ట్రాల నుంచి 900 మంది ప్రతినిధులు ఉండగా ఏపీ నుంచి 37 మంది పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన సుంకర రాజేంద్రప్రసాద్ అఖిల భారత ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో పొగాకు పంటకు నష్టం: ప్రశాంత్‌కుమార్


పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతునర్న ప్రశాంత్ కుమార్

సీతానగరం, జనవరి 2:రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో పొగాకు పంట దెబ్బతిందని పొగాకు బోర్డు ఛైర్మన్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రఘుదేవపురంలోని పొగాకు పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పొగాకు బోర్డు కేవలం రైతుల అవసరాలను గుర్తించి వారికి అనుకూలంగా ప్రభుత్వంతో చర్చించి పనులు చేయించడం తప్ప హామీలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. పొగాకు రైతుల పరిస్థితి, పంట పాడైన విధానం అధికారులు, మంత్రుల వద్దకు తీసుకువెళ్లే ప్రయత్న లోపం లేకుండా చేశామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన రావడం లేదన్నారు. బీజేపీ నేత నీరుకొండ వీరన్న చౌదరి, పొగాకు బోర్డు సభ్యులు కాట్రగడ్డ సత్యనారాయణ మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి పొగాకు బోర్డు తొలగించి దేవరాపల్లి బోర్డులో కలపడం వలన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, సబ్సిడీపై వచ్చే ఎరువులు కూడా రైతులకు అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్షన్ సూపరింటెండెంట్ జీఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సబ్సిడీపై ఎరువులు ఇవ్వడానికి బోర్డుకు అభ్యంతరంలేదని, కానీ రైతు కమిటీ సభ్యులు అంతదూరం వచ్చి ఎరువులు తీసుకువెళ్లే అవకాశం లేదని చెప్పడం వలన ఇవ్వడం లేదన్నారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు ఇచ్చే అవకాశం పరిశీలించాలని రైతులు కోరారు.


సాంగ్‌ను రిలీజ్ చేస్తున్న కరాటం తదితరులు

అనన్య చిత్రం విజయవంతం కావాలి

జంగారెడ్డిగూడెం, జనవరి 2 : సినిమాల్లో చిన్న, పెద్ద అని విభజన తగదని ప్రేక్షకులను మెప్పించిన ప్రతి సినిమా గొప్ప సినిమాయేనని ప్రముఖ సినీ నిర్మాత, ఎగ్జిబిటర్ కరాటం రాంబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం పరిసరాల్లో సిద్ధిధాత్రి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై బి.ప్రసాద్ రాజు దర్శకుడిగా నిర్మించిన అనన్య చిత్రం ఫస్ట్ సాంగ్ స్థానిక నూకాలమ్మ ఆలయంలో రిలీజ్ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కరాటం మాట్లాడుతూ, అనన్య చిత్రం హర్రర్ నేపథ్యంలో నిర్మించిన సినిమా అని, కుటుంబం అంతా చూడదగ్గ చిత్రం అని పేర్కొన్నారు. జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ, మన ప్రాంతంలో సినిమాల నిర్మాణానికి అన్ని సౌకర్యాలు, లొకేషన్లు ఉన్నాయని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన పండు, టెక్స్‌మో శ్రీరాములు, నిర్మాత జంధ్యాల గంగాధరశర్మ, సహనిర్మాత బుద్దాల సత్యనారాయణ, సింగంశెట్టి సత్యనారాయణ, కె.ఎస్. శంకరరావు, కనుపర్తి శ్రీనివాస్, వేణుమాధవ్, షేక్‌లాల్, హీరో జైరామన్ జుత్తిగ, రాజేష్ పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు వేయించాలి


టీకా వేస్తున్న జేడీ

ద్వారకాతిరుమల, జనవరి 2: పాడి రైతులు అపోహలు విడనాడి పశుసంపదను కాపాడుకునేందుకు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు సూచించారు. రామన్నగూడెంలో మంగళవారం 520 గేదెలు, 170ఆవులకు టీకాలు వేశారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 31 వరకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. పశువైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పాడిపశువులకు ఉచితంగా టీకాలు వేస్తారని పేర్కొన్నారు. ఏలూరు డివిజన్ డీడీ డాక్టర్ టి. గోవిందరాజు, ఏడీ సాయిరమేష్, పశువైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ముదినేపల్లి-గుడివాడ రోడ్డులో ధాన్యాన్ని కాపాడుతున్న కూలీలు

వాతావరణంలో మార్పు.. రైతు గుండెల్లో గుబులు!

ముదినేపల్లి, జనవరి 2 : వాతావరణం ప్రతికూలంగా మారటంతో నడి రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో వర్షం పడుతుందేమోనని రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యం రాశులను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ముదినేపల్లి నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం రోడ్ల వెంబడి ధాన్యం రాశులు నిల్వ ఉన్నాయి. వాటిని పరదాలతో కప్పుకుంటూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతంగా జరగకపోవడం, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ జాప్యం జరుగుతుండటంతో రోడ్ల వెంబడి ధాన్యం ఎక్కడికక్కడే ఉండిపోయింది. తేమశాతం తగ్గించేందుకు రైతులు గత పది రోజులుగా ముదినేపల్లి, పెయ్యేరు, పెదగొన్నూరు, వాడవల్లి తదితర గ్రామాల్లో వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆరబెట్టారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

105 ఏళ్లుగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

- నేటి నుంచి ప్రారంభం
- దాతల సహకారంతో ఉత్సవాలు
- కర్నాటక సంగీత కళాకారుల గానమాధుర్యం..


త్యాగరాజస్వామి, భమిడిపాటి సూర్యనారాయణ, కారుమూరి నరసింహమూర్తి

భీమవరంటౌన్, జనవరి 2 : త్యాగరాజు ఆరాధనోత్సవాలు.. జిల్లాలో ప్రముఖంగా వినిపించే పేరు. త్యాగరాజ గానసభ ఆధ్వర్యంలో నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో ఎంతో ప్రసిద్ధిగాంచిన కర్నాటక సంగీత కళాకారులు తమ గానమాధుర్యంతో పట్టణ సంగీత రసజ్ఞులను ఓలలాడించిన చరిత్ర ఉంది. గత 105 సంవత్సరాలుగా నిర్విరామంగా ఈ ఉత్సవాలు జరుగుతుండడం విశేషం. కేవలం దాతల సహకారంతోనే ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 1919లో పట్టణానికి చెందిన సర్వాధర్మయ్య మహనీయులు త్యాగరాజ ఉంఛావృత్తినే స్వీకరించిన సంగీతప్రియుడు ధర్మయ్య, త్యాగరాజ ఆరాధనోత్సవాలను మొదటగా పంచారామక్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర, జనార్ధనస్వామి ఆలయంలో ప్రారంభించి మూడేళ్ల పాటు నిర్వహించారు.

పిదప స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామ చేసిన భమిడిపాటి సూర్యనారాయణ ఏకధాటిగా 15 సంవత్సరాలు నిర్వహించారు. అనంతరం కారుమూరి నరసింహమూర్తి ఆ బాధ్యతను స్వీకరించి రజతోత్సవం చేశారు. ఆస్థాన కవీంద్రుడు శ్రీపాద కృష్ణశాస్త్రి, సంగీత విద్యాంసుడు హరినాగభూష ణంలను పట్టణ పురవీధుల్లో ఊరేగించి సత్కరించి గౌరవించారు. ఆయన కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి సంస్థల వ్యవస్థాపకులుగా ఉన్నారు. కారుమూరి సారథ్యంలో బైద్యనాథ్ భగవతార్, మహావాది వెంకటప్పయ్య, అదిబట్ల నారాయణదాసు, దీక్షిత దాసు, ద్వారం నాయుడు నరసింగరావు నాయుడు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి ఎందరో మహానుభావులు ఇక్కడ కచేరీలు నిర్వహించారు. ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు 50 సంవత్సరాలు పాటు ఉత్సవాలను నిర్వహించారు. సంగీత విద్యాంసులు డి.కె.పట్టామాళ్, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, రాధా సిస్టర్స్, ఎం.ఎల్. వసంత కుమారి, పి.లీల, శ్రీరంగం గోపాలరత్నం, మాండలిన్ శ్రీనివాస్, షేక్ చినమౌలా, అన్నవరపు రామస్వామి, ఎం.ఎల్.ఎస్.రాజు, తిరుపతి పొన్నారావు, కున్నకుడి వైద్యనాథన్ వంటి సంగీత విద్యాంసులతో సర్వోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వీరి హయంలోనే అధ్యక్షులుగా గన్నాబత్తుల నారాయణమూర్తి, గన్నాబత్తుల పెదతాత, గవర శ్రీమన్నారాయణ త్యాగరాజభక్త సభను బలోపేతం చేశారు. చెరుకువాడ సుబ్బారావు, పులపర్తి వెంకటరామయ్య, ముసలయ్య, తలవర్తి కృష్ణమూర్తి, జోశ్యుల అచ్యుతరామయ్య, భూపతిరాజు రామకృష్ణంరాజు ఎనలేని సేవలు అందించారు. వెంకటేశ్వరరావు హయంలోనే పారిశ్రామికవేత్త యు.కె.విశ్వనాధరాజు అధ్యక్షులుగాను, గమని రాజు కార్యదర్శిగాను క్రియాశీలకంగా వ్యవహరించారు. చెరుకువాడ సోదరులు, నూలి లక్ష్మి, కురిశేటి లక్ష్మి, వేగేశ్న రంగరాజు, కనుమూరి సత్యనారాయణరాజు, కె.కె.ఆర్. గాంధీరాజు కార్యదక్షులుగా నిర్ణయించి త్యాగరాజ మ్యూజిక్ అకాడమిగా రీ గ్రేడ్ చేయించి ఆరోధనోత్సవాలు జరిపిస్తున్నారు. బుధవారం నుంచి ఈ నెల 8 వరకు 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, త్యాగరాజస్వామి వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధికి కృషి

కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాలా



సమావేశంలో మాట్లాడుతున్న పర్షోత్తం రూపాలా

ఉండి, జనవరి 2 : కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల మెరుగైన జీవనోపాధికి ప్రత్యేకంగా పాటుపడుతుందని కేంద్ర మత్స్య పశుసంవర్ధకశాఖ మంత్రి పర్షోత్తం రూపాలా అన్నారు. వాండ్రంలోని ఆక్వా ట్రేడర్స్ అసోసియేషన్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి సిదిరి అప్పలరాజు విచ్చేశారు.రూపాలా మాట్లాడుతూ, మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. 2030 నాటికి విదేశాలకు లక్ష కోట్ల విలువైన మత్స్య సంపద ఎగుమతికి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా పనిచేస్తుందన్నారు. ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాలలో పర్యటించి మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. అప్పలరాజు మాట్లాడుతూ, మత్స్యకారుల స్థితిగతులలో మార్పురావాలని రాష్ట్రప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆక్వారైతులకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుకు సహకారిస్తుందన్నారు. అనంతరం వీరికి ఆక్వారైతులు తమ సమస్యలను విన్నవించారు. రాజ్యసభసభ్యుడు బీదా మస్తాన్‌రావు, అప్సడా వైస్ ఛైర్మన్ రఘురాం, జిల్లా జాయింట్ కలెక్టరు సుందరరామ్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసుల రాజు, సోము వీర్రాజు, భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులు

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు వైఎస్సార్ హెల్త్ వర్సిటీ జట్టు..

ఏలూరు స్పోర్ట్స్, జనవరి 2: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సైన్సెస్ వర్సిటీ పురుషుల క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్టు ఫిజికల్ డైరెక్టర్ బి.వి.ఎస్.ఎమ్ శ్రీనివాసరాజు మంగళవారం తెలిపారు. కె.వి అభిషేక్, ఆర్.హర్షచందర్, వై.గౌతమ్, జి.ప్రవీణ్‌కుమార్, జి.శివనిరంజన్, ఏ.అన్వేష్‌బాబు, డి.కిరణ్, సిహెచ్. రాజేష్, ఎస్.నితిన్, ఏ.బి. రక్షిత్, ఎం.లిఖిత్, పి.సునీల్‌కుమార్, షేక్ గంజికుతుబ్, ఎం.సాయిషణ్ముక్, వి.సాయిచందు, సచిన్ చౌదరి, స్టాండ్‌బైగా కె.పి.ఎస్ రామకృష్ణ, డి.ప్రకాష్, ఎస్.కె మహ్మద్‌జక్కీ, ఎస్. కిరణ్‌గోపాల్‌లను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 7 నుంచి 16 వరకు చెన్నైలో జరుగుతాయని చెప్పారు. ప్రతిభ ప్రాతిపదికన జట్టును ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు.

నేడు, రేపు నన్నయలో ప్లేస్మెంట్ డ్రైవ్

రాజమహేంద్రవరం, జనవరి 2 : ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధ, గురువారాలలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జి.వి.కె. బయోసైన్సెస్ ఆర్గన్ లైఫ్‌సైన్స్ నిర్వహిస్తున్న ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌కు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. రాతపరీక్షలో ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్, హెచ్.ఆర్.రౌండ్ నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని జి.వి.కె. బయోసైన్సెస్ ఆర్గన్ లైఫ్‌సైన్స్ సంస్థలో నెలకు రూ.27 వేల జీతంతో ఉద్యోగం కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను లేదా విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డిని సంప్రదించాలని కోరారు.


నన్నయ విశ్వవిద్యాలయం మహిళా క్రికెట్ జట్టు

సౌత్ ఇండియా మహిళా క్రికెట్ పోటీలకు 'నన్నయ' జట్టు ఎంపిక

దెందులూరు, జనవరి 2: సౌత్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా క్రికెట్ పోటీలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ (రాజమండ్రి) క్రికెట్ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో ఐదు జిల్లాల కళాశాలల పరిధిలో 55 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన 16 మందితో పాటు మరో ఐదుగురిని స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. కోయంబత్తూరులో త్వరలో జరగనున్న పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం తరపున పాల్గొంటారని నతానియేల్ వివరించారు. ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరడాని అచ్యుత్‌రావు, కాకి సుబ్బారావు, ఆదిరెడ్డి సత్యనారాయణ, రాజా, మహ్మద్ అబ్దుల్ హకీం భాషా పాల్గొన్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు దుర్గాప్రసాద్


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

భీమవరం రూరల్, జనవరి 2 : ఢిల్లీలో ఈనెల మూడు నుంచి 10వ తేదీ వరకు జరిగే 67వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ అండర్-17 పోటీల్లో తమ కళాశాల విద్యార్థి దుర్గాప్రసాద్ పాల్గొంటాడని డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్ మంగళవారం తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా ఆ జట్టు సభ్యుడైన దుర్గాప్రసాద్ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడని పీడీ దావూద్‌ఖాన్ వివరించారు. కరస్పాండెంట్/సెక్రటరీ చీడే సత్యనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

క్రైం కార్నర్

పుల్లమ్మ చెరువులో పడి బాలుడి మృతి



నిడమర్రు జనవరి 2 : ఆడుతూపాడుతూ అప్పటివరకు తమ వద్దే తిరిగిన చిన్నారి అంతలోనే చెరువులో శవమై తేలడంతో తల్లిదండ్రుల తల్లడిల్లిపోయారు. పెదనిండ్రకొలనులో జరిగిన విషాదఘటన అందరినీ చలించివేసింది. వివరాలివి. సోమవారం రాత్రి భవాని దీక్ష స్వీకరించిన కడళ్ల రమేశ్ తన ఇంటి వద్ద భజన ఏర్పాటు చేశారు. అతడి సోదరి అత్తిలి మండలం గొంతేడుకు చెందిన పెచ్చెటి అనురాధ కుమారుడు వేదన్స్ (4)తో కలసి గ్రామానికి విచ్చేసింది. భజన అనంతరం అల్పాహారం ఏర్పాట్లు చేశారు. చిన్నారి మోటార్ సైకిల్‌తో ఆడుకొంటూ ప్రమాదవశాత్తు పుల్లమ్మచెరువులో పడిపోయాడు. ఎంత సేపటికీ బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఊరంతా వెతకడం మొదలుపెట్టారు. రాత్రి 10 గంటల సమయంలో చెరువులో వేదన్స్ శవమై కనిపించడంతో తల్లిదండ్రుల రోదనతో ఆప్రాంతం దద్దరిల్లింది.

టిప్పర్ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

ఏలూరు క్రైం, జనవరి 2: రోడ్డుపై ఆగిపోయిన ఓ లారీని తప్పించబోయి రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని టిప్పర్ ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఇది. వివరాలివి. ఏలూరు రూరల్ మండలం పోణంగి రోడ్డు వైఎస్ఆర్ కాలనీ ఐదవ రోడ్డులో నివాసం ఉంటున్న నేలపాటి యర్రమ్మ (60)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పెడనలో ఉంటున్నాడు. కుమార్తె ఏలూరు కొత్తపేటలో ఉంటుంది. కుమార్తె వద్దకు మంగళవారం సాయంత్రం వెళ్లి తిరిగి వస్తుండగా వడ్డెరగూడెం వద్ద రోడ్డు దాటుతున్న యర్రమ్మను టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వన్‌టౌన్ సీఐ ఎస్. రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఐ లక్ష్మణబాబు తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు

పెదవేగి, జనవరి 2 : మండలంలోని జానంపేట సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి. విజయరాయికి చెందిన పూజారి నాగశైలజ (18), అమ్మమ్మ లేగల నాంచా రమ్మతో కలిసి ఏలూరు ఆస్పత్రికి ఆటోలో బయలుదేరారు. జానంపేట దాటి గౌతమీ బ్రాందీ ఫ్యాక్టరీ దగ్గరకు వచ్చేసరికి ఏలూరు వైపు నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ .. ఆటోను వేగంగా ఢీకొట్టడంతో అది నుజ్జునుజ్జు అయింది. ఆటోలో ఉన్న నాగశైలజ అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె అమ్మమ్మ నాంచారమ్మ, ఆటో డ్రైవర్ దేవదాసు శామ్యూల్ తీవ్రంగా గాయ పడ్డారు. క్షతగాత్రులను ఏలూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

పెన్నాడలో వ్యభిచార గృహంపై దాడి

పాలకోడేరు, జనవరి 2 : పెన్నాడలో వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. ఎఫ్‌సీఐకి వెళ్లేదారిలో ఓ అద్దె ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న సమాచారం అందుకున్న టూటౌన్ ఇన్‌చార్జి సీఐ జి.శ్రీనివాస్ తన సిబ్బందితో మంగళవారం ఆ గృహంపై దాడి చేసి ఓ మహిళను, సహకరించిన వ్యక్తితో పాటు మరో ఐదుగురు విటులను అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆవిరైన నూతన ఆనందం

- డివైడర్ దాటివచ్చి ఢీకొన్న కారు
- మరో కారులో ఉన్న ముగ్గురి మృతి
- ప్రమాదానికి కారణమైన కారులో అందరూ క్షేమం
- ఎనిమిది మందికి గాయాలు
- మృతులది హైదరాబాద్
- బంధపురం వద్ద ఘటన


మృతులు రమాదేవి, దివ్యప్రియ

దేవరపల్లి/ కొవ్వూరు/ రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 : దేవరపల్లి మండలం బంధపురం వద్ద మంగళవారం మధ్యాహ్నం రెప్పపాటులో ప్రమాదం జరిగింది. నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకుని బయలుదేరిన ఆ కుటుంబం.. అంతలోనే విషాదంలో మునిగిపోయింది. మృత్యువు డివైడర్ దాటుకుని వచ్చి ముగ్గురిని మింగేసింది. హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ మాక్స్ సొసైటీ ఏరియా, లింగంపల్లి సంగారెడ్డి జిల్లా ఆర్కే రామచంద్రపురం లో అక్కాతమ్ముళ్ల తమతమ కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు గత నెల 30న రెండు కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది తమ సొంత కారులో వైజాగ్‌లోని తమ్ముడి అత్తవారింటికి వచ్చారు. రెండురోజుల పాటు ఆనందంగా గడిపారు. వైజాగ్ చుట్టు పక్కల ప్రాంతాన్నీ తిరిగిచూశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు వచ్చిన కారులోనే హైదరాబాద్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం రెండు గంటలు అవుతుంది.. ఎక్కడైనా ఆగి భోజనం చేద్దామని అనుకుంటున్నారు. అంతలోనే కృష్ణాజిల్లా నంది గామ నుంచి వైజాగ్‌కు వెళుతున్న కారు డివైడర్ దాటుకుని వేగంగా దూసుకొచ్చి హైదరాబాద్ వైపు వెళుతున్న కారును ఢీకొట్టింది.. రెండు కార్లు తుక్కు తుక్కుఅయిపోయాయి. అటుగా వెళ్లే ప్రయాణికులకు ఏం జరిగిందో అర్థం కాలేదు.. వాహనదారులు తేరుకుని కార్ల దగ్గరకు వెళ్లి చూశారు. రెండుకార్లలో 11 మంది ప్రయాణిస్తుండగా అందరూ తీవ్ర గాయాలపాలయ్యారు. డ్రైవింగ్ చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సుభాష్ గౌడ్‌కు తీవ్రగాయాలు కాగా తల్లి రమాదేవి (50), భార్య దివ్యప్రియ(25) కొవ్వూరు ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మృతి చెందారు. కుమార్తె గనిష్క (19నెలలు) దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బావ మల్లికార్జున్, సోదరి స్వప్న, మేనల్లుడు విశ్వక్‌సాయి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డివైడర్ దాటుకువచ్చి ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న నందిగామకు చెందిన పాస్టర్ వేల్పుల విజయ మోహన్, సంజనీగ్రేస్, రోహిన్, అమితశ్రీలు దేవరపల్లిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా క్షేమంగానే ఉన్నారు. ఘటన ప్రాంతాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని అధికారులకు ఆదేశించారు. ప్రమాదం నుంచి తేరుకున్న సుభాష్ గౌడ్ తన కుటుంబీకులు ఎలా ఉన్నారని పలుమార్లు అడగడం కంటతడి పెట్టించింది. తన తల్లి, భార్య, కుమార్తె మృతిచెందారని తెలియదు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అనసూరి శ్రీనివాసరావు తెలిపారు.



నకిలీ బంగారంతో మోసగించిన మహిళపై ఫిర్యాదు

భీమవరం క్రైం, జనవరి 2 : నకిలీ బంగారంతో ఓ మహిళ మోసగించినట్లు వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదుపై ఒకటో పట్టణ ఎస్ఐ ఎన్. హనుమంతరావు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలివి. భీమవరం కురిశేటి వారి వీధిలోని ఓ బంగారు దుకాణానికి మూడేళ్ల బాలుడితో ఓ మహిళ వచ్చింది. పిల్లవాడికి మురుగులు సరిపోవడం లేదని విక్రయించేస్తున్నానని, మురుగులు ఎంత విలువ ఉంటే అంత బంగారు గొలుసు ఇవ్వాలని అడిగింది. 916 కేడీఎం, హాల్‌మార్క్ ఉండటంతో వ్యాపారి చేబ్రోలు విజయకుమార్ నమ్మారు. ఆమె వెళ్లిపోయిన తరువాత పరిశీలించగా ప్లేటెడ్ బంగారమని గుర్తించారు. డిసెంబరు 28న ఈ సంఘటన జరగ్గా బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేశారు.

శ్రీవారి క్షేత్రంలో 14 నుంచి సంక్రాంతి సంబరాలు

- 15న నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు



ద్వారకాతిరుమల, జనవరి 2: శ్రీవారి క్షేత్రంలో ఈనెల 14 నుంచి 16 వరకు సంక్రాంతి సంబరాలు జరుపుతామని ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయ తూర్పు గోపురం వద్ద కోలాటాలు, భజనలు, నృత్యాలు, హరిదాసులు, బుడబుక్కల వేషధారణలతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 15న నిత్యార్జిత కల్యాణం, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని చెప్పారు. 16న స్వామివారు సమీప గ్రామమైన దొరసానిపాడుకు అట్టహాసంగా బయలు దేరి వెళ్తారని, ఈ ఉత్సవాన్ని తిలకించేందుక భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని ఈవో కోరారు.

శేషవాహనంపై శేషాచలవాసుడు

- ముగిసిన ద్రవిడప్రబంధ అధ్యయనోత్సవాలు


శేషవాహనంపై తిరువీధులకు బయలుదేరిన శ్రీవారు, అమ్మవార్లు

వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో కొలువు తీరిన శ్రీవారు క్షేత్రపుర వీధుల్లో ఊరేగారు. చిన్నవెంకన్న క్షేత్రంలో జరుగుతున్న ద్రవిడప్రబంధ అధ్యయనోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం మొదలుగా ఈ ఉత్సవాలను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. తొలుత కల్యాణమండప ఆవరణలో పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వెండి శేషవాహనంపై ఉంచి అలంకరించి అట్టహాసంగా ఊరేగించారు. తమ ఇంటి ముంగిట స్వామి, అమ్మవార్లకు భక్తులు హారతులు పట్టారు.


శిథిలజీవి, ఖరీదు నాటికలో సన్నివేశాలు

నాటక రంగాన్ని బతికించుకోవాలి

ఏలూరు కల్చరల్, జనవరి 2: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఉందని ప్రముఖ రంగస్థల, సినీనటులు ఉప్పులూరి సుబ్బరాయశర్మ అన్నారు. స్థానిక వైఎమ్‌హెచ్‌ఏ ప్రాంగణంలో మంగళవారం గరికపాటి ఆర్ట్స్ థియేటర్- హైదరాబాద్, మహతి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సాంఘిక నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు జరిగే నాటకోత్సవాలను సుబ్బరాయశర్మ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి కళలు, నాటకాలు ఎంతో దోహదపడతాయన్నారు. మానవ విలువలకు ప్రతిరూపమే నాటకాలు అన్నారు. శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎం.బి.ఎస్ శర్మ, లంకా వెంకటేశ్వర్లు మాట్లాడారు. తొలిరోజు మణికంఠ ఆర్ట్స్- పిఠాపురం వారి 'ఖరీదు' నాటిక, పెందుర్తి నటరాజ్‌ఆర్ట్స్ డమ్రత్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'శిథిలజీవి' నాటికలు సందేశాత్మకంగా సాగాయి. నటీనటులు హావభావాలతో ప్రేక్షకులను రంజింప చేశారు. గరికపాటి ఆర్ట్స్ థియేటర్ వ్యవస్థాపకులు గరికపాటి కాళిదాసు పర్యవేక్షించారు. బుద్దాల వెంకటరామారావు, ఎస్.వి రామారావు, జి.దాశరథి శ్రీనివాస్, ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



పోడూరు, జనవరి 2: మండలంలోని గుమ్మలూరు శివారు రావిగొప్పులో వేంచేసియున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి షష్టి తిథి మంగళవారం పురష్కరించుకుని పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పండితులు బాదంపూడి శ్రీహరివెంకట సుబ్రహ్మణ్యశర్మ మంత్రోర్చనలతో, వాయిద్య మేళతాళాలతో, భక్తజన సందోహం మధ్య స్వామి కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఆలయ పునర్నిర్మాణ దాత పెన్మెత్స వెంకట నరసింహరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న లాయర్లు

నల్లచట్టాలను రద్దు చేయాలి

నూజివీడు, జనవరి 2: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు కోరుతూ న్యాయవాదు లు కొద్ది రోజులుగా దీక్షలు చేస్తున్నారు. ఈమేరకు మంగళవారం నిరసన దీక్షలో సీనియర్ న్యాయవాదులు మన్నెం రమేష్, వైఎస్ దొరై మాట్లాడుతూ పేదల భూహక్కులను హరించే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అనే నల్లచట్టాన్ని తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజల తరపున చేస్తున్న ఈ ఆందోళనకు అందరూ మద్దతు ఇవ్వాలని వీరు కోరారు. ఈ చట్టం రద్దయ్యేవరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.


వీరవాసరంలో అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అయోధ్య అక్షింతలు పంపిణీ

ఆకివీడు, జనవరి 2: వెంకటరామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మంగళవారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాణిక్యాలరావు, ఓలేటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వీరవాసరం: అయోధ్య శ్రీరాముడి అక్షింతలు ఇంటింటా పంపిణీ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తున్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పంపిన అక్షింతలతో పాటు రాముని చిత్రం, కరపత్రం అందజేస్తున్నారు. మంగళవారం మండలంలోని నందమూరుగరువు రామాలయంలో అక్షింతల వితరణ ప్రారంభించారు. ప్రత్యేక పూజలు అనంతరం జై శ్రీరామ్ నినాదాలతో కోదండరాముని చిత్రపటాన్ని ఉంచిన ప్రత్యేక వాహనంతో గ్రామోత్సవం చేస్తూ అక్షింతలు అందచేస్తున్నారు. నవుడూరులోనూ అక్షింతల వితరణ జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల వెంకట చలపతిరావు, రావి మురళి, వడ్డి కనకదుర్గాప్రసాద్, ముద్రగళ్ళ సురేష్, బీజేపీ, విశ్వహిందూపరిషత్ కార్యకర్తలు కురెళ్ళ నరిసింహారావు, కోడి నరిసింహం, మేకల బాబి, యాళ్ళ శ్రీను పాల్గొన్నారు.

భీమవరం టౌన్: అయోధ్య నుంచి వచ్చిన బాల రాముని అక్షతలను భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో ఇంటింటికి పంపిణీ చేశారు. కార్య క్రమంలో కంతేటి వెంకటరాజు మడిపల్లి శేఖర్ సరిపిడకల రామారావు మారిశెట్టి రాంప్రసాద్, కుక్కల బాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు రామన్నపాలెంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వడలి గ్రామంలో శ్రీరామ భక్తులు ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేశారు. శ్రీ మందాలమ్మ తల్లి దేవాలయం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం అక్షింతలు, శ్రీరాముని అలయ చిత్రపటం, అయోధ్య ఆహ్వాన పత్రం ఇంటింటి కి అందజేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: అయోధ్య రాముడి అక్షింతలు ఇంటింటికి అందిస్తామని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకవల్లి రామకృష్ణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, కోట రాంబాబు, చిట్యాల రాంబాబు పాల్గొన్నారు.

పెనుగొండ: రెండవ విడత ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలని జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి జవ్వాది విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఎస్‌వీకేపీపీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె సందర్శించి వైద్యులు, వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. జిల్లాలో 502 క్యాంప్‌లు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాస్ దొర, వైద్యులు ఎస్. వినోద్ కుమార్, జె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైసీపీ మోసపూరిత హామీలు నమ్మవద్దు

నరసాపురం టౌన్, జనవరి 2: వైసీపీ చెప్పే మోసపూరితమైన హామీలను ప్రజలు నమ్మవద్దని టీడీపీ అగ్నికులక్షత్రీయ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొప్పాడ రవి అన్నారు. మంగళవారం పట్టణంలోని భూపతివారివీధిలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలో టీడీపీ ఇచ్చిన హామీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, భూపతి నరేష్, భూపతి బాబ్జీ, బుంగా శేఖర్, కాగితపు ప్రభు పాల్గొన్నారు.

మోడల్ పేపర్లు పంపిణీ

నరసాపురం రూరల్, జనవరి 2: సీతారాంపురం హైస్కూల్‌లో పదోవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ మోడల్ పేపర్లను స్కూల్ చైర్మన్ జేవీఆర్ అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం పుల్లకొండం శ్రీనివాస్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

నరసాపురం టౌన్, జనవరి 2: కొత్తగా మంజూరైన పింఛన్లను కాటన్ పార్కులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అందించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, కౌన్సిలర్లు పాలూరి బాబ్జీ, జయరాజు, కావలి నాని, గోరు సత్తిబాబు, షేక్ బుల్లిమస్తాన్ పాల్గొన్నారు.

ఆకివీడు: పట్టణ పరిధిలో మంజూరైన పింఛన్లను నగర పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, చైర్మన్ జామి హైమావతి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జోత్స్న, కమిషనర్ కృష్ణమోహన్, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, మెప్మా చైర్మన్ మోరా జ్యోతిరెడ్డి, మన్నే పోతురాజు-లలితాదేవి పాల్గొన్నారు.

కాళ్ళ: కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఉండి నియోజకవర్గంలో మొత్తం 36562 పింఛన్లు అందజేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శిరీష, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు సుంకర భోగేశ్వరరావు, సర్పంచ్ బందా విజయ పాల్గొన్నారు.

'భూహక్కు చట్టం రాజ్యాంగ ఉల్లంఘనే'

నరసాపురం టౌన్, జనవరి 2: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ హక్కు చట్టం రాజ్యాంగాన్ని ఉల్లంఘించేలా ఉందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్య నాయుడు అన్నారు. మంగళవారం భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాదులు విధులు బహిష్కరించి గేట్ వద్ద ఆందోళన చేశారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. కార్యక్రమంలో లాయర్లు శ్రీధర్, పద్మ, నర్సింహరాజు, హర్షవర్ధన్, చాముండేశ్వరి, రఘురాం, గణేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కె.అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆస్తుల భద్రతపై ప్రభావం చూపే ఈ చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు మాకా శ్రీనివాసరావు, ముప్పిడి సురేష్ రెడ్డి, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవంలో రాయకుదురు విద్యార్థుల ప్రతిభ

వీరవాసరం, జనవరి 2: గత నెల 30,31 తేదీలలో భీమవరంలోని చింతల పాటి బాపిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో నిర్వహించిన బాలోత్సవంలో రాయకుదురు జడ్పీహైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. నిర్వహించిన 14 అంశాలలో ఏడింటిలో ప్రథమ బహుమతి సాధించారని హైస్కూల్ హెచ్ఎం కానుకొలను శ్రీనివాసరావు తెలిపారు. మెమరీ పరీక్షలో పంజా ప్రణీత, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్‌లో జె. ప్రణవి, విచిత్ర వేషధారణలో జి.త్రిషిత, జూనియర్ పాటల విభాగంలో జె.లాస్య, కె.శ్రావణి, కె.గీతిక, కవిత రచనలనో కె.అపర్ణ, నృత్యం సీనియర్స్ విభాగంలో కె.జ్యోషి, విఘ్నేశ్వరి, ఎస్.యామిణి, ఎస్.ప్రసన్న, సీనియర్స్ పాటల విభాగంలో అందే భావన, కె.మాధురి, వి.సునీత ప్రథమ స్థానం పొందారన్నారు.

భక్తాంజనేయుడికి భక్తుల తాకిడి

వీరవాసరం, జనవరి 2: నందమూరుగరువులోని రామ భక్తాంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. హనుమద్వ్రత మహోత్సవాలు నేపథ్యంలో మంగళవారం భక్తులు వందల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సింధూర, తమలపాకు పూజలు నిర్వహించారు. మొక్కు తీర్చుకొనే క్రమంలో పలువురు భక్తులు స్వామి వారికి అప్పాలమాలలు వేశారు. అలాగే సమీపంలోని రామాలయంలో ఉంచిన అయోధ్య అక్షింతలను దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం రూరల్, జనవరి 2 : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

ట్రస్టు ఆసుపత్రికి రేపు ప్రత్యేక వైద్యనిపుణులు

పెంటపాడు, డిసెంబరు 2: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 4న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి పత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణలు ఉచితంగా వైద్యసేవలు అందిస్తారన్నారు.


ఆకివీడులో అంగన్‌వాడీల నినాదాలు.. కాళ్ళలో గేదె దూడకు వినతిపత్రం అందజేత.. నరసాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం.. పాలకొడేరు, తణుకులలో పొర్లు దండాలు..

పొర్లు దండాలతో అంగన్‌వాడీల నిరసన

22వ రోజుకు చేరిన ఆందోళన

ఆకివీడు/నరసాపురం/వీరవాసరం/పాలకోడేరు/కాళ్ళ/గణపవరం/పెనుమంట్ర/పెంటపాడు/తణుకు/ఆచంట/పెనుగొండ/భీమవరం అర్బన్/మొగల్తూరు/తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 2: అంగన్‌వాడీల సమ్మె మంగళవారం నాటికి 22వ రోజుకు చేరింది. వీరవాసరం బస్టాండ్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీలు పాటలు, భజనతో పాటు, పొర్లు దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఆకివీడులో అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 22వ రోజు గాంధీజీ సెంటర్‌లో చెవిలో పువ్వులు పెట్టుకొని మంగళవారం నిరసనలు తెలిపారు. నరసాపురంలో డిమాండ్లను పరిష్కరించాలంటూ అంబేడ్కర్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందించారు. పాలకోడేరులో పొర్లు దండాలు పెడుతూ అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. కాళ్ళ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని దున్నపోతుతో పోలుస్తూ గేదె దూడకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆకివీడు సెక్టార్ లీడర్ మార్తమ్మ, సీఐటీయూ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్స్ ఎడవల్లి చంద్రావతి, ఝాన్సీ రాణి, మాణిక్యం, రాజామణి పాల్గొన్నారు. గణపవరంలో సీఎం జగన్ చిత్రపటాలకు అంగన్వాడీలు పొర్లుదండాలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, రామకోటి, ఎండీ హసీన, జయలక్ష్మి, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి నాయకత్వం వహించారు. పెనుమంట్రలో అంగన్‌వాడీలు దున్నపోతు, కోతికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూనంపూడి సుబ్బరాజు సంఘీభావం తెలిపారు. పెంటపాడులో సమస్యలు పరిష్కరిస్తారా? లేక ఉరి వేసుకుని చావమంటారా? అంటూ అంగన్వాడీలు, ఆయాలు మెడకు చీరలతో ఉరి బిగించుకుని నిరసన తెలిపారు. ఆచంట కచేరి సెంటర్‌లో అంగన్‌వాడీలు సీఎం జగన్ తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దున్నపోతుకు వినతిపత్రం అందజేసి అనంతరం పొర్లు దండాలు పెట్టారు. పెనుగొండ మండలంలో అంగన్‌వాడీలు జగన్ ఫొటోకు నమస్కరిస్తూ పొర్లు దండాలు పెట్టారు. అనంతరం దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. తణుకు, భీమవరం, మొగల్తూరులలో కూడా పొర్లు దండాలతో నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెంలో మెడకు ఉరి బిగించుకుని నిరసన తెలిపారు.

5వ తేదీలోగా సమ్మె విరమించాలి: కలెక్టర్

భీమవరం, జనవరి 2 : అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల సమ్మె కారణంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమ్మె విరమించాలని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ నెల ఐదో తేదీలోగా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. అంగన్‌వాడీ ప్రతినిధులతో మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇతర ముఖ్య అధికారులు వివిధ స్థాయిలలో ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరిపి వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించడంతోపాటు, ఇప్పటికే పెండింగ్‌లోవున్న అద్దెలు, కూరగాయలు, పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు విడుదల చేశారన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం తప్పనిసరిగా షెడ్యూల్ ప్రకారం గర్భిణులకు, పాలిచ్చే తల్లి, బిడ్డకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించాలన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సేవలను కొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసినట్టు తెలిపారు.

జగనన్న సురక్ష రెండో విడత ప్రారంభం

పాలకోడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష - 2 క్యాంప్‌ను వైద్యాధికారి డా.సిహెచ్‌వీ రంగంనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పాలకోడేరులో నిర్వహించారు. కార్యక్రమంలో సురక్షా - 2 స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఉపసర్పంచ్ వెంకటరాజు, డా.స్వర్ణ నిరంజని, లీలా లక్ష్మి, సీహెచ్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

పెంటపాడు: పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాలలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ అధ్యక్షతన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కొందరికి ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఎంపీపీ దాసరి హైమవతి, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు నల్లమిల్లి విజయానందరెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా, మండల చైర్మన్లు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: జగనన్న రెండోవిడత కార్యక్రమం సిద్దాపురం గ్రామంలో నిర్వహించారు. మొదటి విడతలో సుమారు 500మంది వైద్యసేవలు పొందగా సుమారు 30మందికి ఉన్నతస్థాయి వైద్యసేవలు పొందినట్లు తెలిపారు. వీరిలో సుమారు 5గురికి గుండెకు స్టంట్‌లు వేసినట్లు తెలిపారు. 15మందికి కళ్ళజోళ్ళు అందజేసినట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌లు పరిశీలనలో భాగంగా సిద్దాపురం విచ్చేసిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సంగీత్ మాధుర్ జగనన్న సురక్ష కార్యక్రమంలో బీపీ చెక్ చేయించుకుని, అక్కడున్నవారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సొసైటీలో క్యాలెండర్ల ఆవిష్కరణ

కాళ్ళ, జనవరి 2 : కలవపూడి సొసైటీలో రైతులు, సంఘ సభ్యులకు అందించే బ్యాగులు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బర్రె గంటయ్య, జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యుడు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, సంఘ సీఈవో కనుమూరి నరసింహరాజు, సభ్యురాలు యాళ్ళ నందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

పెనుమంట్ర, జనవరి 2 : ఉచిత యోగా శిక్షణ తర గతులను మంగళవారం వరాహ స్వామి కళ్యాణ మంటపంలో మాన వతా అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చిర్ల శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ పడాల జగన్నాథ రెడ్డి, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. యోగా మాస్టర్ పడాల రామచంద్రారెడ్డి యోగాతో ఉపయోగాలు గురించి వివరించారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశమైన ఎలక్ట్రీషియన్లు

గణపవరం, జనవరి 2: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరించాలని సంఘ అధ్యక్షుడు వెంకట రత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సమావేశం అంబేడ్కర్ భవనంలో మంగళ వారం నిర్వహించారు. ముగ్గురు సీనియర్ సభ్యులను సత్కరించారు. ఎలక్ట్రి కల్ వర్కర్స్‌కు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి దాసు, బషీరుద్దీన్, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరగూడెంలో క్రిస్మస్ విందు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 2: క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఉప్పరగూడెంలో ప్రతి ఏటా నిర్వహించే విందు మంగళవారం జరిగింది. గ్రామస్థులంతా తమ సహకారం అందించడంతోపాటు తలో రకం స్వీటు వేసి విందు భోజనం పెట్టారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

మొగల్తూరు, జనవరి 2: నియోజకవర్గంలో 250 కిలో మీటర్ల మేర ఉన్న 48 ఆర్అండ్‌బి రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం కోమటితిప్ప-కొత్తోట, జిల్లేడితిప్ప-నీటితిప్ప-జగన్నాథపురం, కోమటితిప్ప-దేయ్యాలతిప్ప గ్రామాల మధ్య గల 17 కిలో మీటర్ల మేర గల ఆర్అండ్‌బి రహదారులను రూ.9కోట్లతో చేపట్టే పనులకు అయన భూమి పూజ చేశారు.

సీపీఐ నేత బర్ధన్‌కు నివాళులు


బర్ధన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

భీమవరం అర్బన్, జనవరి 2 : కార్మిక, కర్షక, బడుగు బల హీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని దారపోసిన కమ్యూనిస్టు యోధుడు ఏబీ బర్ధన్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపు నిచ్చారు. భీమవరం ఆర్టీసీ ఎంప్లాయస్ యునియన్ కార్యాలయంలో మంగళవారం సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి ఎబీ బర్ధన్ 8వ వర్ధంతి నిర్వహించారు. బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అర్హులందరూ కేంద్ర పథకాలు పొందాలి

పోడూరు, జనవరి 2: అర్హత కల్గిన ప్రతీ ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 18 రకాల సంక్షేమ పథకాలను పొందాలని బీజేపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు కోరారు. వేడంగి, మట్టపర్రు గ్రామాల్లో సర్పంచులు చెల్లబోయిన పద్మపార్వతి శారద, దొమ్మేటి శ్రీనివాసరావుల అధ్యక్షతన జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్ర సభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభలో ఉజ్వల పథకం కింద మంజూరైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను, వైద్యఆరోగ్య పథకం కార్డులను పంపిణీ చేశారు. నాయకులు బొలిశెట్టి విశ్వేశ్వరరావు, ఇనుకొండ రంగారావు, కొండేటి సుభాష్‌చంద్రబోస్, ఎంపీడీవో సుహాసిని, కార్యదర్శులు కొత్తపల్లి సీతారామరాజు, ములపర్తి శ్రీనివాసు పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కౌలు రైతు సంఘం జిల్లా న్యూఇయర్ క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్కరణలో సంఘం జిల్లా నాయకులు ఎం.రామాంజనేయులు, కె.సుబ్బరాజు, బి.శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


భీమవరంలో అర్ధనగ్న ప్రదర్శన.. తాడేపల్లిగూడెం, తణుకులలో ఒంటి కాలిపై నిలబడి నిరసన

మునిసిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

భీమవరం టౌన్, జనవరి 2: మునిసిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తొలుత భీమవరం మున్సిపల్ ఆఫీసు వద్ద నుంచి తాలూకా ఆఫీస్ మీదగా ప్రకాశం చౌక్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడారు. ప్రభుత్వం పోటీ కార్మికులను తీసుకొచ్చి కార్మికులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తుందని ఈ పద్ధతి మంచిది కాదని హెచ్చరించారు. మునిసిపల్ కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మునిసిపల్ జేఏసీ నాయకులు జి. నాని, ఎస్.విశ్వనాథం, బంగారు వరలక్ష్మి, నిమ్మకాయల ధనలక్ష్మి పాల్గొన్నారు

తణుకు: మున్సిపల్ కార్మిక సంఘ విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మున్సిపల్ కార్మికుల సంఘ గౌరవాధ్యక్షుడు కామన మునిస్వామి అన్నారు. మంగళవారం ఎనిమిదో రోజు సమ్మెలో కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, సంఘ నాయకులు ఎం.నాగేంద్ర కుమార్, తాడిపత్రి దుర్గ, సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని మున్సిపల్ కార్మికులు మంగళవారం ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. సీఐటీయు నాయకులు కర్రి నాగేశ్వరరావు, ఎన్. సతీష్, టి. భాను, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా 8వ రోజు మెయిన్ సెంటర్‌లో మంగళవారం నిరసనలు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉరి వేసుకుంటామని కార్మికులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, మూర్తి, నరేష్, కుమార్, శ్యామ్, రమణ, .దనాలదేవి, రాజు పాల్గొన్నారు.

నిజాయితీగా ఓటు వేయాలి

భీమవరం టౌన్, జనవరి 2: ఓటును పవిత్రంగా స్వచ్ఛందంగా నీతి నిజాయితీతో వేసినపుడే నిజమైన ప్రజాస్వామ్యానికి మార్గదర్శకమని, ఓటును వేసే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించి సమర్ధవంతమైన నాయకత్వానికి ఓటు వేయాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యింటి సత్యనారయణ అన్నారు. లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో రెవెన్యూ శాఖ, శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం ప్రజా స్వామ్య పరిరక్షణ అంశంపై ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్స్‌తో ర్యాలీ సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి ఓటు ప్రతిజ్ఞ చేయించారు.

అన్న క్యాంటీన్ వద్ద అన్నసమారాధన



తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 2: పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన పి.చినవెంకటేశ్వరరావు, కుమారి దంపతుల సహకారంతో కార్యక్రమం జరిగింది. పట్నాల రాంపండు, ముప్పిడి రమేష్, ఎరుబండి సతీష్, పసలపూడి రాంబాబు, చెప్పుల వాసు, ముత్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలదిగుబడి పెంపునకు చర్యలు


శిబిరం వద్ద పశుదాణా అందజేస్తున్న చైర్మన్ పసల కనకసుందర రావు

పెంటపాడు, డిసెంబరు 2: పాలదిగుబడి పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందర రావు అన్నారు. మంగళవారం ముదునూరులో పశువులకు టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ భావన ధాన్యలక్ష్మి అధ్యక్షత వహించారు. డీడీ డాక్టర్ సుధాకర్, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ కైగాల శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ గుండుమోగుల సాంబయ్య పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



పెనుగొండ, జనవరి 2: ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై మునమర్రు గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి ఎస్. శ్రీనివాస్ దొర మాట్లాడుతూ ఈవీఎలపై ప్రతీ ఒక్కరూ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అంటూ ఈవీఎంల పని తీరు, ఓటరు ఏ విధంగా ఓటు వేయాలి అనే అంశంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టి.మెహర్, ఏఎస్‌వోస్ దుర్గా సాయి, సెక్టార్ ఆఫీసర్ టీవీస్ ప్రసాద్, సెక్టార్ పోలీసు ఆఫీసర్ జి.రాంబాబు, బీఎల్‌వోలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

ఉండి, జనవరి 2: యండగండి గ్రామానికి చెందిన అడపా సత్యనారాయణ(47) అతని భార్య గ్రామంలో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 1వ తేదీన పార్టీకి వెళ్తున్నానంటూ బయటకు వెళ్లి అర్ధరాత్రి వచ్చి వాంతులు చేసుకోవడంతో భార్య కంగారుపడి చుట్టు పక్కల వారికి చెప్పడంతో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. మతిస్థితిమితం లేకపోవడంతో మందు తాగిన మైకంలో దాంట్లో పురుగుల మందును కలుపుకుని తాగడంతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఉమాభారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు.

గాలి కుంటువ్యాధి టీకాలు వేయించండి

ఆకివీడురూరల్ జనవరి 2 : గుమ్ములూరులో గాలి కుంటువ్యాధి టీకాలు కార్యక్రమాన్ని పశువైద్యులు ప్రారంభించారు. సుమారు నెలరోజులపాటు టీకాలు వేస్తారని తెలిపారు. గాలి కుంటు అనేది అంటువ్యాధని తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి ముందుగానే వ్యాధి సోకకుండా పశువులకు వ్యాక్సినేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఏడీ కె.జనార్దనరావు, కె.భార్గవి సత్య, సర్పంచ్ అనంతలక్ష్మి, ఎంపీటీసీ కోపల్లె హనుమ పాల్గొన్నారు.

లక్ష్మీ నారాయణుడికి సౌందర్య రాజు అలంకరణ



పాలకొల్లు టౌన్, జనవరి 2: పాలకొల్లు చిన్నగోపురంలో శ్రీఅష్ట భుజ లక్ష్మీనారాయణ స్వామికి ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 17వరోజు మంగళవారం సౌందర్యరాజుగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది. ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన హనుమద్వ్రత ఉత్సవాలు


మహా నివేదనకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం టౌన్, జనవరి 2: మారుతి టాకీస్ సెంటర్‌లోని శ్రీదాసాంజనేయ స్వామి హనుమద్వ్రత మహోత్సవాల ముగింపు రోజు మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మహా నివేదనకు హారతులు ఇచ్చి ప్రారంభించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

రామమందిర ప్రతిష్ఠకు ఆహ్వానం

భీమవరం టౌన్: ఈ నెల 22వ తేదీన అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిర ప్రతిష్ఠ ఆహ్వానపత్రికను విశ్వ హిందూ పరిషత్ ప్రాంత అధ్యక్షుడు వబి లిశెట్టి శ్రీవెంకటేశ్వర్లుకి ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ సంఘచాలక్ హరికుమార్ రెడ్డి, గోదావరి విభాగ్ సంఘచాలక్ మంతెన రామచంద్రరాజు మంగళవారం భీమవరంలో అందజేశారు.

ఎంపీ రఘురామకు అండగా ఉండాలి


మహదేవపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరాజు, భరత్

ఉండి, జనవరి 2: రాష్ట్రంలోని అరాచక పాలనపై తన తండ్రి ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు అలుపెరగని పోరాటం చేస్తున్నారని భరత్ అన్నారు. సోమవారం ఉప్పరగుడెం, ఉత్తరపాలెంలలో ఎంపీ నిధులు రూ.15లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ఎమ్మెల్యే రామరాజుతో కలిసి భరత్ ప్రారంభించారు. కనుమూరు భరత్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలనేది తన తండ్రి సంకల్పమన్నారు. రఘురామకృష్ణంరాజుకు ప్రజలంతా మద్దతుగా వుండాలంటూ ఆయన కోరారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం


రోగి కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 2: పట్టణంలోని 32వ వార్డుకు చెందిన యలమర్తి విజయలక్ష్మి క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో మంగళవారం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ ఆమెను పరామర్శించి రూ. 10 వేలు, కాపు సంక్షేమ సంఘం సభ్యులు మరో రూ. 10 వేలు మొత్తం రూ. 20 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. రామిశెట్టి సురేష్, మాదాసు ఇందు, గుండుమోగుల సురేష్, ఎం. నరసింహ, రావూరి రమేష్, రావూరి సురేష్, రామిశెట్టి సత్యనారాయణ, మద్దాల వీరు పాల్గొన్నారు.

స్మార్త పండితుడు విశ్వేశ్వర శాస్త్రి మృతి



భీమవరం టౌన్, జనవరి 2 : పట్టణంలోని నర్సయ్య అగ్రహారంకు చెందిన ప్రముఖ స్మార్త పండితుడు (అపర నిష్ణాత) వేలూరి విశ్వేశ్వర శాస్త్రి మృతి చెందారు. ఆయన వయస్సు 67 సంవత్సరాలు, ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పట్టణంతోపాటుగా చుట్టుపక్కల గ్రామాలో ఆయన ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించేవారు. అనారోగ్యంతో మృతిచెందారు. మృతివిషయం తెలుసుకున్న పట్టణ ప్రముఖులతోపాటు గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.